క్లుప్తంగా

'రేపల్లె' విద్యార్థికి ఎంపీ అభినందన



రేపల్లె: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.విద్యార్థి(984) కె.అనీల్‌ను మంగళవారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అభినందించారు. ప్రభుత్వ కళాశాల పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూ.5వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ప్రిన్సిపల్ సుధాకర్‌ను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

వేమూరు సీహెచ్‌సీలో సదరం క్యాంపు



వేమూరు: సదరం క్యాంపు ద్వారా దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని డాక్టరు బి.జయకృష్ణ పేర్కొన్నారు. వేమూరు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించారు. 15 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వారికి పరీక్షలు చేసి, సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ప్రతి మంగళవారం సీహెచ్‌సీలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎముకల విభాగం వైద్యులు దివ్యాంగులకు పరీక్షలు చేస్తారని డాక్టర్ జయకృష్ణ తెలిపారు.

సమ్మర్ చెస్ కోచింగ్ ప్రారంభం



బాపట్ల అర్బన్: స్థానిక ఏబీఎం హై స్కూల్లో సమ్మర్ చెస్ కోచింగ్ సెంటర్‌ను ముఖ్య అతిథులు డాక్టర్ ఎం.శరత్ బాబు, డాక్టర్ రసూల్ మంగళవారం ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దిన గంగరాజు మురళీకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ రసూల్ మాట్లాడుతూ విద్యార్థులు చెస్ నేర్చుకోవడం వల్ల జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. పరిపూర్ణమైన ఆలోచన, ముందు చూపు నిర్ణయాలకు చురుకైన మెదడుకి చెస్ వ్యాయామంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్కే బాజీ బాషా (చెస్ కోచ్), ప్రసన్నకుమార్, సురా విజయబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను మంగళవారం హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ ఎడ్యుకేషన్ కోర్సు, చేతి రాతలో ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శిక్షణనివ్వనున్నట్లు హై స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు తెలిపారు. సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.దీప్తి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్కే లాల్ జాన్, పలువురు ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

5న పాలిసెట్ మోడల్ టెస్ట్

కొల్లూరు/రేపల్లె: ఈ నెల 5న పాలిసెట్ మోడల్ పరీక్ష ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్, కార్యదర్శి సూర్యప్రకాష్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు నేతృత్వంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో రూపొందించి పాలిసెట్ ప్రశ్న పత్రం ద్వారా విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కొల్లూరులోని శ్రీ సాయి వాసవీ, శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ. 30 చెల్లించి పరీక్ష కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 76589 57907, 94909 87646 నంబర్లకు సంప్రదించాలని చెప్పారు.

అపార్ట్‌మెంట్ నుంచి పడి విశ్రాంత ఉద్యోగి మృతి

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని చెంచుపేటలో విషాదం నెలకొంది. ఇక్కడి జెండా చెట్టు బజారుకి చెందిన విశ్రాంత ఉద్యోగి బల్లా రామారావు(75) మంగళవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు భార్య, కుమార్తె, అల్లుడు ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఓ అపార్ట్‌మెంటులో నివసిస్తున్నాడు. గతంలో మేడపాడులో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన రామారావు ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసామాన్య శక్తి స్వరూపం

- కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం
- ఆదిపరాశక్తి ప్రతిరూపం చందోలు బండ్లమ్మ
- నేటి నుంచి అమ్మవారి వార్షిక తిరునాళ్ల



బండ్లమ్మ దేవాలయం



బండ్లమ్మ



అమ్మవారు వెలసిన బావి (జలాశయం)

చందోలు(పిట్టలవానిపాలెం): అమ్మలగన్న అమ్మ, ఆది పరాశక్తి ప్రతి రూపంగా కొలిచే భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల కొంగుబంగారం చందోలు బండ్లమ్మ. ఇక్కడ బావిలో అమ్మవారి విగ్రహం దొరకగా.. దేవాలయ నిర్మాణంలో ఆభరణాలు బయల్పడ్డాయి. ఎంతో చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయ తిరునాళ్ల బుధవారం ఘనంగా ప్రారంభకానున్నాయి. మే 7 వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

వేడుకగా తిరునాళ్ల

మొదటి రోజు అఖండ జ్యోతితో తిరునాళ్ల ప్రారంభంకానుంది. తవ్వకాల్లో లభించిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని మే 6న శనివారం అలంకరిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన బందోబస్తును పోలీసు శాఖ ఏర్పాటు చేయనుంది.

అభిషేక జలం ప్రత్యేకత..

చందోలు గ్రామంలో బగళాముఖి అమ్మవారు వెలిశారు. అమ్మవారు వెలిసిన బావి కాలగర్భంలో కలిసిపోయి ఆక్రమణకు గురయ్యి.. ఎక్కడ ఉందో తెలియలేదు. 2017లో అప్పటి ధర్మకర్తల మండలి చైర్మన్ దోమ నాగేశ్వరరెడ్డి, భక్తులు కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి పాత రికార్డుల ప్రకారం 15 రోజులు శ్రమించి భూ మట్టం నుంచి 13 అడుగుల లోతులో ఒక పురాతన జలాశయం వంటి బావిని కనుగొన్నారు. ప్రస్తుతం 45 అడుగుల చుట్టు కొలతతో 15 అగుల వెడల్పు, 28 అడుగులకు పైబడిన లోతులో అమ్మవారు బయల్పడిన జలాశయం దర్శనమిస్తుంది. ఆ బావిని పునరుద్ధరించారు. ప్రతి రోజూ ఆ జలాశయ తీర్థమే అమ్మను అభిషేకించడానికి ఉపయోగిస్తున్నారు.

అసమాన్య శక్తి రూపం..

దశ మహా విద్యల్లో 8వ స్థానం కలిగినదే బగళాముఖీ శక్తి. కపాల మాలాంకృతురాలిగా, మకర కిరీట ధారిణిగా, అసుర వాహనంపై ఆసీనురాలై పాశం, స్తంభనాయుధం, అభయ హస్తం, పాన పాత్రలను ధరించి, కపాల యజ్ఞోపవీత ధారిణిగా ఉండే అసామాన్య రూపం బగళాముఖి శక్తి. అదే రూపంలో.. సూర్యచంద్రులు ఇరువైపులా ఉండగా, త్రినయనిగా చెవికి నాగము, కపాలం ధరించి, ఎడమ చెవికి వృత్తాకారంలో ఉన్న కర్ణాభరణం కలిగిన విగ్రహరూపం బగళాముఖి అని స్పష్టమవుతోంది.

ఆధ్యాత్మిక శక్తి సంపన్నమైన ఈ స్థానంలో ఎందరో మునీశ్వరులు తపస్సు చేసి, అమ్మ సాక్షాత్కారం పొందారు. ఆధునిక కాలంలో చందోలు గ్రామాల శ్రీ విద్యోపాసకులుగా విరాజిల్లిన బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి అమ్మ శక్తులను ఎన్నో సార్లు భక్తులకు ప్రత్యక్షంగా చూపించారు. వీరి ఆధ్వర్యంలో 1972లో ఆలయ ఆవరణకు భక్తుల సహకారంతో ప్రహరీ నిర్మించారు. 2002లో దేవాదాయ శాఖ ఆలయ ముఖ మండప నిర్మాణానికి గుంతలు తీస్తుండగా కేజీ 467 గ్రాముల బరువు గల అమ్మవారి ప్రాచీన ఆభరణాలు బయల్పడ్డాయి. లభ్యమైన ఆభరణాల్లో అమ్మవారి వడ్రాణం, కమ్మలు, చెవి దిద్దులు, హారం, ముక్కు పుడక, మంగళ సూత్రాలు, కను బొమ్మలు ఉన్నాయి. అప్పట్లో ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పురావస్తు శాఖ కొన్ని వందల ఏళ్ల కిందటి బంగారు ఆభరణాలుగా వాటిని గుర్తించింది. అప్పటి నుంచి ఆ ఆభరణాలు బ్యాంకు లాకరులో భద్రపరిచి, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు, దేవాదాయ శాఖల అధికారుల సమక్షంలో తీసుకొచ్చి.. ఏటా అమ్మవారిని వార్షిక తిరునాళ్ల మహోత్సవంలో ఒక రోజు అలంకరించడం జరుగుతుంది.

హరిద్ర శృంగార్చన..

బగళాముఖి అమ్మవారి దేవాలయంలో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. వివాహం కాని ఆడపిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు.

వైభవంగా మొగదారమ్మతల్లి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ మోపిదేవి



ఉత్సవాల్లో పాల్గొని, భక్తులను పలకరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: నిజాంపట్నంలో వేంచేసిన శ్రీ మొగదారమ్మతల్లి ఆలయ సిడిమాను మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మత్స్యకారుల ఇలవేల్పు మొగదారమ్మతల్లి ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మంగళవారం జల క్రీడల కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథ బాబు నిజాంపట్నంలోని మొగదారమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ వెంకటరమణారావు మాట్లాడుతూ మొగదారమ్మ తల్లి సిడిమాను ఉత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించకోవడం ఆనవాయితీ అని తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయడం జరిగిందన్నారు.

జలక్రీడలు..

ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక వాహనాలపై నీటిని ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో తిరుగుతూ యువత కోలాహలంగా నీటిని చిమ్ముకుంటూ జల క్రీడలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది.

నేటి నుంచి భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు



భద్రావతి సమేత భావనారుషి స్వామి

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో కొలువైన భద్రావతి సమేత భావనారుషి, మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు వైభవోపేతంగా నిర్వహిస్తారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. తొలి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు కల్యాణం మహోత్సవాలు జరుగుతాయని రెండు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. గురువారం స్వామి వారి కల్యాణం, శుక్రవారం దివ్య రథోత్సవం జరగనున్నాయి. కాళవాసురుడు, మూలకాసురుడు అనే రాక్షసులు దేవదానవులను చిత్ర హింసలకు గురి చేస్తుంటే.. వారిని సంహరించడం కోసం 20 వేల మంది రుషులు చేసిన యజ్ఞ గుండం నుంచి అవిర్భవించిన 16 సంవత్సరాల బాలుడే భావనారుషిగా పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయి. భావనారుషే మొట్ట మొదటిగా వస్త్రాలను సృష్టించి, ప్రపంచానికి అందిచాడనే నమ్మకం ఆయని సంతతివారైన పద్మశాలీయుల్లో ఉంది. తమకు జీవనోపాధిని కల్పించిన ఆ మహనీయుడిని తమ కులానికి మూల పురుషుడిగా భావిస్తూ పూజిస్తారు. స్వామి వారి ఉత్సవాలు పురస్కరించుకుని దేవాలయాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



యూరిన్ బ్యాగ్‌లు అందజేస్తున్న ఎంపీపీ మోహన్

వేమూరు: ట్రాక్టరు బోల్తా పడిన ప్రమాదంలో కాళ్లు, నడుము దెబ్బతిన్న వ్యక్తికి యూరిన్ బ్యాగులు అందజేసినట్లు ఎంపీపీ యల్లమాటి మోహన్ తెలిపారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం ద్వారా వీటిని అందజేసినట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో 'నీరు-చెట్టు' పథకం కింద తవ్విన చెరువులోని మట్టి పూడికలో ట్రాక్టరు బోల్తా పడటంతో వరహాపురం గ్రామానికి చెందిన యల్లమాటి దాసు కాళ్లు, నడుము దెబ్బతిని మంచానికే పరిమితమయ్యారు. అతనికి యూరిన్ బ్యాగ్‌లు కోసం నెలకు రూ.2వేలు ఖర్చు.. కుటుంబానికి భారం కావడంతో ఎంపీపీ మోహన్ చొరవ తీసుకొని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మధుతో మాట్లాడారు. ప్రతి నెలా యూరిన్ బ్యాగ్‌లు కుటుంబానికి అందజేయాలని ఆయన కోరారు. తాళ్లూరు శ్రీనివాసరావు ఉన్నారు.

బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు

తెనాలిరూరల్: మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడని ఓ యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామానికి చెందిన హరినాథ్ అతని ఇంటి సమీపంలో నివసించే మైనర్ బాలిక(ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంటోంది) వెంట పడుతుండే వాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు యువకుడి కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. గత నెల 29న బాలిక ఇంటికెళ్లి హరినాథ్ ఆమెను తనతో పాటు తీసుకెళ్లాడు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు చేయగా రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం వల్లభాపురం వద్ద అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో మంగళవారం గుర్తించి, యజమానికి రూ. 8 వేల జరిమానా విధించారు.

వృద్ధాశ్రమానికి ఎయిర్ కూలర్ వితరణ

తెనాలి: పట్టణలోని బుర్రిపాలెం రోడ్డులో ఉన్న శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమానికి దాతలు ఎయిర్ కూలర్‌ను బహూకరించారు. నూరేళ్ల తెనాలి రంగస్థలి రచయిత నేతి పరమేశ్వర శర్మ కుమారుడు సీతారామరాజు, విశాలాక్షి దంపతులు మంగళవారం ఆశ్రమానికి ఈ కూలర్‌ను అందజేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి కృతజ్ఞతలు తెలియజేశారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

తెనాలిటౌన్: చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జమ్ముల రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా శాప్ సహకారం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు.

అన్నదాతకు.. మాజీ జవాను ఆపన్న హస్తం



బాధిత రైతుకు నగదు అందజేస్తున్న కాటి విజయకుమార్, గ్రామస్తులు

బాపట్ల: మూలపాలెం రైతు మార్పు ఆనందరావుకు చెందిన రెండున్నర ఎకరం వరికుప్ప ఆదివారం అర్ధరాత్రి పిడుగు పడి పూర్తిగా దగ్ధమైంది. సన్నిహితుల ద్వారా విషయం తెలుసుకున్న విశ్రాంత జవాను కె.విజయకుమార్(ఆర్మీ విజయ్) మంగళవారం గ్రామానికి చేరుకొని ఆనందరావుకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి సాగు చేసి ధాన్యం ఇంటికి చేరే తరుణంలో పిడుగు పడి వరికుప్ప దగ్ధమవడం బాధించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు రైతు సహనం ముందు చిన్నబోతాయన్నారు. బాధిత రైతుకు తన వంతుగా ఎలాంటి సహాయమైన అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు విజయ్‌ను ఘనంగా సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గ్రామ పెద్దలతో కలిసి విజయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు బిళ్ళా స్టాన్లీ విమల్ కుమార్, బిళ్లా కమల్ కుమార్, జోగి బుల్లబ్బాయి, గ్రామ పెద్దలు వడ్డిముక్కల మోషే, బెజ్జం రాజు, సాధు వీరయ్య, గొరెముచ్చు వసంత రావు, డక్కుమళ్ల అంకాలు, సునీల్ తదితరులున్నారు.

చిన్నారి నర్తకులకు ఐరావతం, నంది పురస్కారాలు



పురస్కారాలతో బాలత్రిపుర సుందరి, శిష్యబృందం

తెనాలి: హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అక్కడి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ఐరావతం జాతీయ అవార్డు, ఆదర్శ స్వర్ణ నంది జాతీయ అవార్డు-2023లో తెనాలి చిన్నారులు నంది, ఐరావతం అవార్డులను అందుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ నర్తకి, నృత్య గురువు డాక్టర్ చల్లా బాల త్రిపుర సుందరికి చెందిన కల్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 30 మంది శిష్య బృందం వివిధ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. కళా నిలయం అధ్యక్షుడు చేరాల ప్రకాష్, లలిత, ప్రముఖ సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఉపాధ్యక్షుడు, ప్రముఖ సినీనటుడు మాణిక్, సినీ నటీనటులు జ్యోతిరెడ్డి, రాజేందర్, కుమనన్, బలగం ఫేమ్ సత్య ఏలేశ్వరం, కర్తానందం, ప్రముఖ జానపద పేరడి గాయని అరుణా సుబ్బారావు, ఆవునూరి నాగరాజుశర్మ తదితర పెద్దలు హాజరయ్యారు. ఇదే వేదికపై డాక్టర్ చల్లా బాలత్రిపుర సుందరి దంపతులను కళా నిలయం అధినేత చేరాల ప్రకాష్ స్వర్ణ నంది, వెండి ఐరావతంతో ఘనంగా సత్కరించారు.

ఆర్ట్ డైరెక్టర్ జయశేఖరరాజుకు సన్మానం



జయశేఖరరాజుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం పెత్తందార్లు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం ఛాలెంజ్ రాముడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు, చిత్రకారుడు, సినీ ఆర్ట్ డైరెక్టర్ నక్కల జయశేఖర రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, దొప్పలపూడి ప్రసాద్, సోమరౌతు శ్రీనివాసరావు, కాలవ బాబురావు, సయ్యద్ షంషుద్దీన్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబ శివరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ స్థాపన



ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలోని శ్రీ గంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి దేవాలంలో మంగళవారం ధ్వజ స్తంభ, కలశ స్థాపన ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రయాగ రాంబాబు శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలతో విఘ్నేశ్వర గవ్యాంతం, దీక్షా, అఖండ స్థాపన, యంత్ర అనుష్ఠానం, పూజ, హారతీ, మంత్ర పుష్పం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ధ్వజ స్తంభ దాతలు పడితపు వెంకటరమణ, మహాలక్ష్మి దంపతులు, ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ, కమిటీ చైర్మన్ ఓగిరాల వీరాస్వామి, స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాన పడి..రైతులు దిగులుపడి



పెదలంక కల్లాల్లో పసుపు దిగుబడిపై కప్పిన పట్టలు

భట్టిప్రోలు: వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో మూడు రోజులుగా రైతులు నానాయాతన పడుతున్నారు. కృష్ణా నది పరీవాహక లంక గ్రామాల్లో పసుపు, మొక్కజొన్న, జొన్న పంట దిగుబడులను కాపాడుకునేందుకు పడుతున్న అవస్థలు అన్ని ఇన్నీ కావు. ఎప్పుడు వర్షం కురుస్తుందో, ఎప్పుడు ఎండ కాస్తుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తడిచిన దిగుబడులను ఆరబెట్టుకోవడం, భద్ర పరచుకోవడంతోనే సమయం కాస్త రైతులకు సరిపోతోంది. పొలాల్లోనే రైతులు కాపలా ఉంటున్నారు. పంట దిగుబడి చేతికొచ్చే సమయంలో వర్షాలు ఆశనిపాతంలా తయారయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో మూడు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు దేవునిపైనే భారం వేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్లపాలెం: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కర్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ ఏఈ ఎం.కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కర్లపాలెం, నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం, ఏట్రావారి పాలెం, పాత నందాయపాలెం, బుద్ధాం, యాజలి, దుండివారి పాలెం, దమ్మనవారి పాలెం, బోలాయ పాలెం, నాగరాజు పాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపు ఓలేరు తిరునాళ్ల

ఓలేరు(భట్టిప్రోలు): ఓలేరు గ్రామంలోని ఓలేటమ్మ తిరునాళ్ల మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారికి గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించుకుని, పొంగళ్లు సమర్పించనున్నారు. అమ్మవారి సన్నిధికి వెంకట్రాజునగర్, ఓలేరు నుంచి ప్రభలు వస్తాయి. ఓలేరు గొడపాలెం నుంచి చిన్నారులు ప్రభను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకు రావడం ఆనవాయితీగా వస్తోంది. తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు బేతపూడి రజనీకాంత్ పర్యవేక్షిస్తున్నారు.

రేపు కట్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవాలు గురు, శుక్ర వారాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ మంగళవారం తెలిపింది. గురువారం అమ్మవారికి చద్ది నైవేద్యాల సమర్పణ, సాయంత్రం లక్ష మల్లెపూలతో పూజ, శుక్రవారం నిత్యపూజ, పావన నదీ స్నానం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు అద్దేపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠ

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలోని కోదండరామస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాదుకు చెందిన వేల్పూరి విజయలక్ష్మి కుమారులు వెంకటేష్ కుమార్, దీపాలి, వేల్పూరి రామకృష్ణ, భారతి దంపతులు విగ్రహాలను అందించినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

దాసరిపాలెం(భట్టిప్రోలు): గొరిగపూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలేనికి చెందిన చాట్రగడ్డ రాంబాబు, అనూష దంపతుల కుమారుడు అజిత్ అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కై తేపల్లి షాలేమ్ రాజు మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన గొర్రుముచ్చు రమేష్ కుమారుడు పుట్టుకతో పోలియోతో, కుమార్తె మానసిక దివ్యాంగత్వంతో బాధపడుతుండటంతో ఆ కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో ఆలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కార్యదర్శి యన్నం సురేష్, ఫౌండేషన్ సభ్యులు క్రాప నాని, యలమాటి దాసు, కాపు నాయకులు చిట్టినేని రాంబాబు, గ్రామస్తులు కోట విజయ్‌కుమార్, మాతంగి రాంబాబు, చేబ్రోలు కోటేశ్వరరావు, ఏసు, బాబి పాల్గొన్నారు.

నేడు రాస్తారోకో

కొల్లూరు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. బుధవారం నిర్వహించనున్న రాస్తారోకోను జయప్రదం చేయాలని సీపీఎం కొల్లూరు మండల కమిటీ సభ్యుడు బొనిగల సుబ్బారావు కోరారు. మంగళవారం కొల్లూరులోని ప్రజా సంఘాల భవనంలో ఈ మేరకు మాట్లాడారు. ఎన్నో బలిదానాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తలపెడుతున్న ద్రోహమని విమర్శించారు. ప్రవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కొల్లూరులో తలపెట్టిన రాస్తా రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకుడు ప్రభాకరరావు, సీపీఎం నాయకురాలు దివ్య పాల్గొన్నారు.

కార్మిక సంఘాల నిరసన..

రేపల్లె: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చర్యను నిరసిస్తూ.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 3న పట్టణంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నాగాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు హాజరుకావాలని కోరారు.

క్రీడాకారులకు ఉచిత శిక్షణ

ఫిరంగిపురం: స్థానిక గాలిబాలి మినీ స్టేడియంలో మంగళవారం సీయాప్‌సీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఫుట్‌బాల్ ఆటలో ఉచిత శిక్షణ కార్యక్రమం రిటైర్డ్ పీడీ హృదయరాజు ప్రారంభించారు. క్రీడాకారులకు కోచ్‌లు వి.నాని, వి.చరణ్‌లు శిక్షణ ఇచ్చారు. 40రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. వి.శ్రీనివాసరావు, బి.ప్రభుదాసు, ప్రదీప్, ఏసోబు పాల్గొన్నారు.